సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం | 24 | ఆగస్టు | 2025



‘ఆటోమేటిక్’తో బిల్లింగ్ సులువు

హెచ్‌టీ సర్వీసుల బిల్లింగ్‌లో లోపాలు సవరించడానికి ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ ప్రక్రియను ప్రారంభించినట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. - 8లో



ఉత్సవాలు ప్రశాంతంగా..

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
$31^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇన్‌స్పైర్ నామినేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

విద్యారణ్యపురి: ఇన్‌స్పైర్ నామినేషన్ల ప్రక్రియ వేగవంతానికి ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని హనుమకొండ జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి కోరారు. శనివారం హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జిల్లాలోని అన్ని మండలాల ఇన్‌స్పైర్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెలాఖరు వరకు నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సదస్సులో హనుమకొండ ఎంఈఓ గుగులోతు నెహ్రూనాయక్, రిసోర్స్‌పర్సన్లు పోతరాజు ఆనందం, దొంతుల శ్రీనివాస్, అమరకొండ సంపత్, ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ అవార్డులకు నామినేషన్లు పంపే విధానంపై అవగాహన కల్పించారు.

సాధికారత సాధించేలా ఫలితాలుండాలి



విద్యారణ్యపురి: స్వయం సాధికారత దిశగా పరిశోధన ఫలితాలు ఉండాలని కేయూ కెమిస్ట్రీ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి డిగ్రీ, పీజీ కాలేజీలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ‘రీసెంట్ ట్రెండ్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ కెమికల్ అండ్ అలైడ్ సైన్సెస్ రీసెర్చ్’ అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి, సంగారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.రమేశ్, సెమినార్ కన్వీనర్ ఎం.అరుణ, కో కన్వీనర్ ప్రశాంతి అధ్యాపకులు ఉదయశ్రీ, బాలరాజు, జ్యోతి, శ్రీనివాస్, వి.శ్రీనివాస్, శాంతికుమార్, రవీందర్, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, సురేశ్‌బాబు ఉన్నారు.

‘సీపీఐ’లో హనుమకొండకు సముచిత స్థానం




శ్రీనివాస్‌రావు



కర్రె భిక్షపతి

న్యూశాయంపేట: సీపీఐ రాష్ట్ర సమితిలో హనుమకొండ జిల్లాకు సముచిత స్థానం లభించింది. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కర్రె భిక్షపతి, నేదునూరి జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేడ్చల్ జిల్లా గాజులరామారంలో జరిగిన పార్టీ 4వ రాష్ట్ర మహాసభల్లో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారితోపాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, మండ సదాలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితుడిగా తోట భిక్షపతిని ఎన్నుకున్నారు. జిల్లాకు సముచిత స్థానం దక్కడంతో నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంజీఎంలో స్టేషనరీ కొరత



ఎంజీఎం : వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో స్టేషనరీ కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఔట్ పేషెంట్ (ఓపీ) అందించే పేపర్లు లేకపోవడంతో శనివారం వైద్యులు తెల్లపేపర్‌పై రాసి ఇస్తున్నారు. దీని వల్ల మెడికల్ లీగల్ కేసులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సిబ్బంది పేర్కొంటున్నారు. ఇన్‌పేషెంట్ అడ్మిట్ చేసేందుకు కేస్ షీట్లు ఓపీ విభాగంలో అందుబాటులో లేకపోవడంతో వైద్యసిబ్బంది ఎమర్జెన్సీ బ్లాక్‌కు పరుగులు పెట్టాల్సి వస్తుంది. బడ్జెట్ లేమితో స్టేషనరీ కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించపోవడంతో అరకొర స్టేషనరీ సరఫరా చేస్తున్నాడని, దీనిద్వారా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిబ్బంది చెబుతున్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు

విద్యారణ్యపురి: ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు అందజేయనున్నట్లు హనుమకొండ జిల్లా విద్యాశాఖ సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా విద్యాశాఖ, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ సంయుక్తంగా హనుమకొండ డైట్ కాలేజీలో ప్రత్యేక అవసరాల పిల్లల క్యాంపు నిర్వహించారు. 14 మండలాలనుంచి 174మంది బాలబాలికలు హాజరయ్యారు. డాక్టర్లు కోమల్‌ప్రసాద్, రాజుహైదర్, ఎస్.దీప్తి, మాధవి, ఫిజియోథెరపిస్ట్ శివకృష్ణ పాల్గొని వారికి ఎలాంటి పరికరాలు అవసరమో నిర్ధారించారు. పిల్లలకు త్వరలోనే పరికరాలు అందజేస్తామని బద్దం సుదర్శన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు శ్రీధర్, సరస్వతి, ప్రవీణ్, శ్రీను, రఘుబాబు, తిరుపతి, భవన్, సుమన్, రజిత, యశోద, రజని, రవి తదితరులు పాల్గొన్నారు.

కోటలో విదేశీయులు



కోటలోని శిల్పాల ప్రాంగణంలో సెల్ఫీ దిగుతున్న 23 దేశాల పర్యాటకులు

హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్ ఆర్డీలో శిక్షణ పొందుతున్న విదేశీయులు వరంగల్ పర్యటనలో భాగంగా శనివారం కాకతీయుల రాజధాని ఖిలావరంగల్ కోటను సందర్శించారు. ఇటలీతోపాటు 23దేశాలకు చెందిన పర్యాటకులు తరలివచ్చారు. శిల్ప కళానైపుణ్యాలను ఆసక్తిగా తిలకించారు. సెల్ఫీలు దిగి సందడి చేశారు. ఖుష్‌మహల్, ఏకశిల గుట్ట, రాతి మట్టికోట అందాలను వీక్షించారు. వారికి కాకతీయుల చరిత్రను కోట గైడ్ దేనబోయిన రవి యాదవ్ వివరించారు. - ఖిలా వరంగల్

ముగిసిన దర్గా ఉర్సు



దవడ నుంచి ఇనుప చువ్వను గుచ్చుకుంటున్న ఫకీర్ - 8లో

కాజీపేట హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా ఉర్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా హైదరాబాద్, పూణే నుంచి వచ్చిన ఫకీర్లు విన్యాసాలు ప్రదర్శించారు. దేశ నలుమూలల నుంచి పీఠాధిపతులు, కులమతాలకతీతంగా భక్తులు తరలొచ్చి దర్గాను దర్శించుకున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. ప్రజలు కలిసిమెలిసి ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. - కాజీపేట రూరల్

తగ్గేదేలే!

రాత్రిపూట మహిళా పోలీసుల పెట్రోలింగ్



సండే స్పెషల్

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగానే చిరునవ్వుతో ఆహ్వానించే ఓ రిసెప్షనిస్ట్. అక్రమార్కుల తాట తీసే ఓ టాస్క్‌ఫోర్స్ టీం మెంబర్. ఇలా శాఖలోని అన్ని విభాగాల్లో ముందుంటున్నారు మహిళా పోలీసులు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో అందరూ సమానమే అనేలా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇన్నాళ్లు కొన్ని విధులకే పరిమితమైన వారంతా ఉన్నతాధికారుల నిర్ణయాలతో రోడ్డెక్కి విధులు నిర్వహిస్తున్నారు. ‘మీ భద్రతే మా బాధ్యత’ అంటూ రాత్రిళ్లు సైతం విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులపై ‘సాక్షి’ సండే స్పెషల్ స్టోరీ.

- వరంగల్ క్రైం

- కూడళ్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో తనిఖీలు
- పురుషులతో సమానంగా విధులు
- వరంగల్ కమిషనరేట్‌లో తమదైన ముద్ర

డయల్ 100 కాల్స్ మొదలుకుని కష్టతరమైన ఫిర్యాదుల విచారణకు సైతం మహిళా పోలీసులు సై అంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పురుషులతో సమానంగా స్వీకరిస్తూ రంగంలోకి దిగుతున్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా బ్లూకోల్ట్ విధుల్లో పురుషులతో కలిసి సమర్థంగా రాణిస్తున్నారు. రాత్రిపూట పెట్రోలింగ్ విధుల్లో భాగస్వామ్యమవుతున్నారు. మహిళా నేరస్తులను జైళ్లకు తరలించే క్రమంలో ఎస్కార్ట్‌గా, నేతల సభలకు షార్ట్ వెపన్లతో హాజరై సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆర్మీకి దీటుగా విధులు..



పోలీస్ శాఖలో అందరూ సమానమే అనేలా పురుషులతో సమానంగా మహిళా అధికారులతో విధులు చేయిస్తున్నాం. ఆర్మీలో పురుషులతో సమానంగా అన్ని రకాల విధులు మహిళా అధికారులు చేస్తున్నారు. అదే స్ఫూర్తితో ఇక్కడ డ్యూటీలు వేస్తున్నాం. ఏ డ్యూటీ వేసినా వారు చక్కగా రాణిస్తున్నారు. గతంలో కూడా అన్ని రకాల డ్యూటీలను మహిళా అధికారులు చేశారు. ప్రస్తుతం మరోసారి వారు అన్ని రకాల విధుల్లో రాణిస్తున్నారు.

- సన్‌ప్రీత్‌సింగ్, పోలీస్ కమిషనర్, వరంగల్

చాలెంజింగ్ విధులు...

రాత్రిపూట విధులు నిర్వహించడం మహిళా పోలీసులకు చాలెంజింగ్ మారింది. బ్లూకోల్ట్స్ సిబ్బందితో సమానంగా రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు నిర్దేశించిన డ్యూటీని నిర్వహిస్తున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని హాస్టళ్ల పరిసరాలను పరిశీలించడంతోపాటు బార్అండ్ రెస్టారెంట్ల వద్ద ఎదురయ్యే ఆకతాయిల గొడవలు, అనుమానితుల వివరాలు సేకరిస్తున్నారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో క్షుణ్ణంగా తనిఖీ చేయడం, రాత్రి పూట రోడ్ల వెంట నిర్వహించే వ్యాపారాలను బంద్ చేసి ఎక్కడా చిన్న ఘటన జరగకుండా చూస్తున్నారు. లాఅండ్ ఆర్డర్‌కు సంబంధించి పెద్ద ఘటన జరిగితే వెంటనే బ్లూకోల్ట్ సిబ్బంది సహకారం తీసుకుని పరిష్కరిస్తున్నారు.



ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో..



మహిళా పోలీస్ అధికారులు అత్యంత హుషారుగా ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను వేతనంతో పాటు 30 శాతం అదనంగా చెల్లిస్తారు. దీనికి తోడు ఉన్నతాధికారుల నుంచి విధులకు సంబంధించి ఎలాంటి ఒత్తిళ్లు లేకపోవడంతో ట్రాఫిక్ విధుల్లో మక్కువ చూపిస్తున్నారు. ప్రస్తుతం ట్రైసిటీ పరిధి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో ఒక ఇన్‌స్పెక్టర్, ముగ్గురు ఏఎస్సైలు, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డు విధుల్లో కొనసాగుతున్నారు.

కష్టతరమైనప్పటికీ విధులకు..

సాధారణంగా పోలీస్ స్టేషన్లలో రూల్‌కాల్ ఉదయం 9 గంటలకు చేపడుతున్నారు. అప్పటి నుంచి 2 గంటల వరకు విధులు నిర్వహించి.. ఆ తర్వాత సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు డ్యూటీలో కొనసాగుతున్నారు. రాత్రి డ్యూటీ ఉన్నవారు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. రిసెప్షన్ విధులు నిర్వహించే మహిళలు ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు డ్యూటీలో ఉంటే మధ్యాహ్నం 2 గంటల నుంచి 9 గంటల వరకు మరొకరు విధులు చేపడుతున్నారు. వీరికి 24 గంటల పాటు రెస్ట్ దొరుకుతుంది.





పద్మాక్షిగుట్ట వద్ద వాహనదారులను తనిఖీ చేస్తున్న మహిళా పోలీసులు

అనుమానం వస్తే తనిఖీ చేస్తున్నాం..



అర్ధరాత్రి యువత బర్త్‌డేలు చేసుకుని రోడ్లపై అరుస్తున్నారు. డ్యాన్సులు చేస్తున్నారు. వద్దని వారిస్తే వాగ్వాదానికి దిగుతున్నారు. బస్టాండ్, చౌరస్తా వంటి ప్రాంతాల్లో మాకు ఏమాత్రం అనుమానం వచ్చినా వారి ఫింగర్ ప్రింట్ తీసుకుని పాత నేరస్తులు అయితే ప్రశ్నించి ఆ సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. రాత్రి పూట విధులు కొంత కష్టమైనప్పటికీ పోలీస్‌శాఖలోకి వచ్చాం కాబట్టి సంతోషంగా నిర్వహిస్తున్నాం.

- ఎం.వినూష, కానిస్టేబుల్

కమిషనరేట్‌లో మహిళా అధికారులు ఇలా..

డీసీపీ	సీఐ	ఎస్‌ఐ
01	02	24

ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుళ్లు	245
కానిస్టేబుళ్లు	352
హోంగార్డులు	70

క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నాం..



పోలీస్‌శాఖలో 30 ఏళ్లగా పనిచేస్తున్నా. రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించడం, అనుమానితులను చెక్ చేయడం వంటివి చేస్తున్నా. నూతనంగా పోలీస్ శాఖలో వచ్చిన మహిళా కానిస్టేబుళ్లకు రాత్రిపూట ధైర్యంగా విధులు ఏవిధంగా నిర్వహించాలో క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నా. వారు ఎంతో బాగా నేర్చుకుంటున్నారు.

- తాండ్ర కమల ఏఎస్సై, హనుమకొండ

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్
- హనుమకొండ, వరంగల్ కలెక్టర్లతో మంత్రి సమీక్ష



కలెక్టర్లతో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

హన్మకొండ: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ, సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ కలెక్టర్ సత్యశారదతో సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాల అమలు తీరు, సంక్షేమ, గురుకుల పాఠశాలల, కళాశాలల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులకు అందుతున్న భోజన, వసతి, జరుగుతున్న లోపాల్ని గుర్తించి సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గురుకుల, ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదులు పెట్టె క్రమం తప్పకుండా పరిశీలించాలని, ఫిర్యాదుల బాక్సులో వస్తున్న ఫిర్యాదులు, వాటికి గల కారణాలను వెంటనే తెలుసుకుని పరిష్కార మార్గాలను చూడాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేశ్, ఆయా గురుకులాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలను పూజిద్దాం..



మట్టి ప్రతిమలతో మేయర్ సుధారాణి, కమిషనర్ బాజ్‌పాయ్, ఆర్పీలు

వరంగల్ అర్బన్: పర్యావరణ హితం కోసం మట్టి ప్రతిమలను పూజిద్దామని వరంగల్ మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో గణేశ్ ఉత్సవాల సందర్భంగా మేయర్, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మట్టి వినాయక ప్రతిమలను మెప్మా ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీలు, బల్దియా సిబ్బందికి పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. బల్దియా ఆధ్వర్యంలో ఈ సంవత్సరం సుమారు 50 వేల ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. మట్టి విగ్రహాలను పూజించేలా ఎస్‌హెచ్‌జీలు, మహిళల్లో చైతన్యం కల్పిస్తూ ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ జోనా, సీహెచ్‌ఓ రమేశ్, సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఎంహెచ్‌ఓ రాజేశ్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి..

నిర్దేశిత గడువులోగా స్మార్ట్ సిటీ మిషన్ పనులు పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్, స్మార్ట్ సిటీ ప్రతినిధులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో స్మార్ట్ సిటీ మిషన్‌కు చెందిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఇందులో ఈఈలు రవికుమార్, సంతోశ్ బాబు, మాధవీలత, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి, బాబులాల్ సింగ్, డీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం మనదే

సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, చిత్రంలో మంత్రి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, యశస్విని రెడ్డి, ఠాకూర్, ఎమ్మెల్సీ సారయ్య, ఎంపీలు కావ్య, బలరాంనాయక్ తదితరులు



- రాష్ట్ర మంత్రులు లక్ష్మణ్, సీతక్క
- జనహిత పాదయాత్రపై సమీక్ష

8లో

ఈ నెల 25, 26 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టనున్న జనహిత పాదయాత్ర విజయవంతానికి శనివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రులు లక్ష్మణ్, సీతక్క హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వందకు వందశాతం విజయం సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. - హన్మకొండ చౌరస్తా

మహిళపై ఎస్సై ప్రతాపం!

ఖిలా వరంగల్: ఓ మహిళపై ఎస్సై ప్రతాపం చూపాడు. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఓ రెస్టారెంట్ శుక్రవారం రాత్రి 11.30 దాటినా తెరిచే ఉంది. అటుగా వెళ్తున్న మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీకాంత్ హోటల్‌లోకి వెళ్లి అర్ధరాత్రివరకు హోటల్ నిర్వహిస్తారా? అని ఆగ్రహంతో గ్యాస్ సిలిండర్ కనెక్షన్ తీయడానికి యత్నించారు. ఎందుకు తీస్తున్నారని హోటల్ నిర్వాహకులు, అక్కడే ఉన్న శివనగర్ ఏసీరెడ్డి నగర్‌కు చెందిన దళిత మహిళ నంద్ర మరియమ్మ ఎస్సైని ప్రశ్నించారు. నన్నే ప్రశ్నిస్తారా? అని ఎస్సై శ్రీకాంత్ దుర్భాషలాడుతూ మహిళపై, అడ్డు వచ్చిన ఆమె కుమారుడిపై చేయి చేసుకున్నాడు. ఈ వీడియో శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ ఘటనపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మరియమ్మ, ఆమె కుమారుడు తెలిపారు. సోషల్ మీడియాలో వైరలైన వీడియోను సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌తోపాటు వరంగల్ ఏసీపీ శుభం చూసి ఎస్సైని వివరణ కోరినట్లు సమాచారం. కాగా.. దీనిపై ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. 11.30 దాటినా హోటల్ ఎదుట గుమిగూడి జనం ఉండడం.. ఇదే హోటల్ ఎదుట ఇటీవల యువకుల నడుమ ఘర్షణ జరిగిందని దీనిని దృష్టిలో పెట్టుకొని.. అర్ధరాత్రి వరకు హోటల్ నిర్వహించటమేంటని నిర్వాహకులను నిలదీసినట్లు, గ్యాస్ కనెక్షన్ తొలగిస్తుండగా మరియమ్మ, ఆమె కుమారుడు అడ్డుకుని, ఎస్సైనని చూడకుండా నెట్టేస్తూ తనమీద చేయి చేసుకున్నారని తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణపై నిర్లక్ష్యం తగదు

కాకతీయ జూలాజికల్ పార్క్‌ను సందర్శించిన జడ్జీలు

సాక్షి ఎఫెక్ట్



వెటర్నరీ డాక్టర్‌ను వివరాలు అడుగుతున్న న్యాయమూర్తులు సాయి కుమార్, క్షమాదేశ్‌పాండే

న్యూశాయంపేట: కాకతీయ జూలాజికల్ పార్క్‌లో అపరిశుభ్రత, రోగాల బారిన పడిన అడవి జంతువుల పరిస్థితిపై ‘వన్యప్రాణుల మూగరోదన’ శీర్షికన ‘సాక్షి’లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్‌పాండేలు స్పందించారు. శనివారం వారు జూపార్క్‌ను పరిశీలించారు. బైసన్ (అడవి దున్న) ఎలా చనిపోయిందనే వివరాలను జూ వెటర్నరీ డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. జూపార్క్ నిర్వహణ సరిగ్గా లేదని, నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గుర్తించారు. వన్యప్రాణుల సంరక్షణపై నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. జూపార్క్‌లో ప్రవహిస్తున్న కలుషితమైన నీరు, పరిసరాలు అపరిశుభ్రతపై సరైన మార్గదర్శకాలు కనుగొని పరిష్కరించాలని సూచించారు. మూగ జంతువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జడ్జిల వెంట అటవీ అధికారులు పి.సూరిదాస్ సింగ్, వెటర్నరీ డాక్టర్ కార్తికేయ,బీట్ ఆఫీసర్ శారద తదతరులు పాల్గొన్నారు.

డెంగీ.. పంజా

- డెంగీబారిన కేఎంసీ వైద్యవిద్యార్థులు
- చికిత్స పొందుతున్న ఎనిమిదేళ్ల చిన్నారి మృతి
- ఎంజీఎంలో 20 రోజుల్లో 59 మందికి డెంగీ నిర్ధారణ



జ్వరపీడితుల కోసం ఏర్పాటు చేసిన వార్డు

ఎంజీఎం: సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ జ్వరాలు పంజా విసురుతున్నాయి. కొద్ది రోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలతో ఎంజీఎం ఆస్పత్రికి వచ్చే జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. ఆగస్టు ప్రారంభం నుంచి నేటి వరకు విషజ్వరాలతో బాధపడుతూ ఔట్ పేషెంట్లు అధిక సంఖ్యలో చికిత్స పొందుతున్న క్రమంలో ఇన్‌పేషెంట్‌గా 1,522 మంది అడ్మిట్ అయ్యారు. ఇందులో 59మంది బాధితులకు డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యాధికారులు సైతం భయాందోళనకు గురవుతున్నారు. కాకతీయ మెడికల్ కళాశాల కార్మికుల సమ్మెతో పారిశుద్ధ్య లోపం హాస్టల్‌లో ఉండే వైద్యవిద్యార్థులు డెంగీ బారిన పడుతున్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో ఓ పీజీ వైద్యుడితో పాటు నర్సింగ్ విద్యార్థులు సైతం డెంగీ బారినపడ్డారు. అలాగే మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చర్లపాలెం గ్రామానికి చెందిన బుచ్చిమల్లు-కవిత దంపతుల కుమార్తె సాత్విక (9) విషజ్వరంతో బాధపడగా.. ఎంజీఎం ఆస్పత్రికి తీసుకు రాగా డెంగీ బారినపడి ఇటీవల మృతి చెందింది.

వైద్య విద్యార్థులకు తప్పని తిప్పలు..

ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యసేవలు అందించే వైద్య విద్యార్థులు కాకతీయ మెడికల్ కాలేజీలోని హాస్టళ్లలో ఉంటూ చదువుతున్నారు. పది రోజులుగా హాస్టళ్లలో పనిచేసే కార్మికులకు వేతనాలు రాకపోవడంతో విధులు బహిష్కరించి వారు ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించి చెత్తాచెదారం పేరుకుపోయి దోమల ఉధృతి పెరగడంతో వైద్యవిద్యార్థులు సైతం విషజ్వరాల బారిన పడుతున్నారు. అధికారికంగా ఓ పీజీ వైద్యుడికి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ కాగా, పదుల సంఖ్యలో వైద్యవిద్యార్థులు విషజ్వరాలబారిన పడి ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తోంది.

ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు..

ఎంజీఎం ఆస్పత్రికి వచ్చే జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ప్రత్యేక ఓపీ విభాగంతో పాటు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిలో 8 మంది డెంగీబారిన పడి చికిత్స పొందుతున్నారు. వీరితో పాటు ఒకరు మలేరియాతో బాధపడుతుండగా డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు.

కిక్కిరిసిపోతున్న ప్రైవేట్ ఆస్పత్రులు..

విషజ్వరాలతో ప్రైవేట్ ఆస్పత్రులు సైతం కిక్కిరిసిపోతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు ఎంజీఎం ఆస్పత్రితో పాటు ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకంలేని వందలాది మంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరి వైద్య సేవలు పొందుతున్నారు.

క్లుప్తంగా

యూరియా వచ్చేసింది..

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేస్టేషన్ గూడ్స్ షెడ్‌కు శనివారం ఇఫ్కో కంపెనీకి చెందిన 1,340.010 మెట్రిక్ టన్నుల యూరియా చేరింది. ఇఫ్కో కంపెనీ ప్రతినిధులతో కలిసి వ్యవసాయ అధికారులు రవీందర్‌రెడ్డి, విజ్ఞాన్ వ్యాగన్‌లోని యూరియాను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యూరియాను ఉమ్మడి జిల్లా పరిధిలోని ఫర్టిలైజర్ షాపులకు 40 శాతం, మార్క్‌ఫెడ్‌కు 60 శాతం పంపిస్తామని వారు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


శ్రీలేఖ మృతదేహం

కాజీపేట : దర్గా కాజీపేటకు చెందిన చాడ శ్రీలేఖ (30) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా పోలీసులు కేసు నమోదు చేశారు. కాజీపేటకు చెందిన శ్రీలేఖకు దర్గా ప్రాంతానికి చెందిన చాడ శ్రావణ్‌కుమార్‌తో 2014లో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెళ్లయిన కొద్దికాలం అన్యోన్యంగా ఉన్నారు. అనంతరం మనస్పర్థలతో ఘర్షణ పడుతున్నారు. ఈ క్రమంలో శనివారం శ్రీలేఖ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందనే సమాచారం మేరకు కుటుంబ సభ్యులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. తమ కూతురు మృతిపై అనుమానాలు ఉన్నాయనే తల్లి చింతకింది లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పార్ట్‌టైం లెక్చరర్‌కు షోకాజ్ నోటీస్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ విద్యా కళాశాలలోని పార్ట్‌టైం లెక్చరర్ డాక్టర్ రమేశ్‌కు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఈనెల 21న షోకాజ్ నోటీస్ జారీ చేశారు. కళాశాలలో అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో గతంలో నియమించిన కమిటీ నివేదిక ఆధారంగా షోకాజ్ నోటీస్ ఇచ్చినట్లు తెలిసింది. కొందరు విద్యార్థులకు ఇంటర్నల్ మార్కులను కూడా అక్రమంగా కేటాయించారని, ప్రైవేట్ కళాశాలల నుంచి వసూళ్లకు పాల్పడడంలోనూ ఆ పార్ట్‌టైం లెక్చరర్ పాత్ర ఉందని కమిటీ పేర్కొన్నట్లు సమాచారం. ఆ లెక్చరర్ వివరణ ఇవ్వకపోతే రిజిస్ట్రార్ చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

సీనియారిటీ జాబితా వెల్లడి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా (పీఎస్ హెచ్ఎం)గా పదోన్నతుల కల్పనకు శుక్రవారం రాత్రి సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి వెల్లడించగా, శనివారం అభ్యంతరాలు స్వీకరించారు. పది మంది ఉపాధ్యాయులు అభ్యంతరాలు తెలియజేసినట్లు సమాచారం. దీంతో మళ్లీ ఆ జాబితాపై తుది కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 24న తుది జాబితా వెల్లడిస్తారు. 25న వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుంది. 26న పదోన్నతుల ఉత్తర్వులు జారీచేస్తారు.



ప్రకృతి సోయగం.. భీమునిపాదం..

ఎత్తైన గుట్టల నడుమ నుంచి జాలువారుతున్న జలపాతం

Sunday Special


జలపాతం వద్ద పర్యాటకుల సందడి

- మనసును కట్టి పడేస్తున్న ఆహ్లాదకర వాతావరణం
- ఆస్వాదిస్తున్న పర్యాటకులు.. టూరిజం కేంద్రంగా ఏర్పాట్లు
- ఎకో డెవలప్‌మెంట్ కమిటీతో నిర్వహణ

గూడూరు: అదో అందమైన జలపాతం. ప్రకృతి రమణీయతను సంతరించుకున్న పచ్చని అటవీ ప్రాంతం. చుట్టూ గుట్టలు.. పక్షుల కిలకిలరావాలు.. గలగల పారే సెలయేటి సవ్వళ్లు.. గుట్టల నడుమ నుంచి సుమారు 70 అడుగుల ఎత్తు నుంచి దూకే జలధార. అదే పర్యాటకులను ఉల్లాస పరుస్తూ.. వారి మనసును కట్టిపడేస్తున్న భీమునిపాదం జలపాతం. పాండవులు వనవాస సమయంలో ఈ ప్రాంతంలో గడిపినట్లు, ఈ జలపాతం పై భాగంలో భీముని పాదముద్ర ఉండడంతో భీమునిపాదం జలపాతంగా పేరుగాంచిందని స్థానికుల నమ్మకం. ప్రకృతి అందాల నడుమ పాలనురగల్లా జాలువారే ఈ జలపాతం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప అటవీ ప్రాంతంలో ఉంది.

జలపాతం పక్కనే దేవుళ్ల విగ్రహాలు..

భీమునిపాదం జలపాతం పక్కనే శివుడు, పాపాయమ్మ, నాగదేవతల విగ్రహాలు ఉన్నాయి. జలపాతం నుంచి జాలువారిన నీరు సమీప భీమునిపాద చెరువులోకి చేరుతుంది. ఈ చెరువు నీటితోనే కొమ్ముల వంచలో పంటలు పండుతాయి. ప్రతీ సంవత్సరం కొమ్ములవంచ గ్రామస్తులు మృగశిరకార్తె ప్ర వేశించిన మొదటి బుధవారం అక్కడ ఉన్న దేవతల విగ్రహాలకు పూజలు చేస్తారు. అలాగే, మహా శివరాత్రి, కార్తీక పౌర్ణమి పర్వదినాల్లో ఇక్కడి విగ్రహాలకు పూజలు చేస్తారు. పర్యాటకులు కూడా జలపాతం కింద స్నానమాచరించి దేవతామూర్తుల విగ్రహాలకు మొక్కుకోవడం ఆనవాయితీ.

రూ. 54 లక్షలతో అభివృద్ధి పనులు..

రిజర్వ్ ఫారెస్ట్, వన్యప్రాణి విభాగం పరిధిలోని ఈ జలపాతం సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అటవీ శాఖ పలు చర్యలు చేపట్టింది. రూ. 54 లక్షలతో జలపాతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. స్వాగత ద్వారం, పార్కు, స్విమ్మింగ్ పూల్, జలపాతం పైభాగంలో కూడా వాచ్ టవర్, కుర్చీలు, బెంచీలు, మంచినీరు, బాత్‌రూమ్‌ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.

ఎకో డెవలప్‌మెంట్ కమిటీ ద్వారా నిర్వహణ..

భీమునిపాద జలపాతం అభివృద్ధికి శ్రీకారం చుట్టిన అటవీశాఖ.. ఎకో డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించింది. ఈ కమిటీలో అదే గ్రామానికి చెందిన వ్యక్తులను చైర్మన్, వైస్‌చైర్మన్‌గా, బీట్ అధికారిని పర్యవేక్షకుడిగా నియమించారు. పర్యాటకుల నుంచి రుసుం రూపేణ వసూలు చేసే మొత్తాన్ని నిర్వహణ ఖర్చుల కోసం ఉపయోగిస్తున్నారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలం ప్రారంభంతో నాలుగు నెలల పాటు జలపాత వీక్షణకు సందర్శకుల తాకిడి ఎక్కువ ఉంటుంది. ప్రతీ ఒక్కరి నుంచి రూ. 40 చొప్పున రుసుము వసూలు చేస్తున్నారు. అదే విధంగా బైక్, ఆటో, ఫోర్, సిక్స్ వీలర్ వాహనాలకు టోకెన్ వసూలు చేస్తున్నారు. అయితే రెండు దశాబ్దాలుగా పర్యాటక కేంద్రంగా పేరుగాంచినా జాతీయ రహదారి నుంచి ఇక్కడకు చేరుకోవడానికి రోడ్డు మాత్రం ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి జలపాతం వరకు బీటీ రోడ్డు వేయించాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

జలపాత సందర్శనకు దారి ఇలా..

భీమునిపాదం జలపాతం వరంగల్‌కు 55 కిలోమీటర్ల దూరంలో ఉంది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడికి చేరుకోవడానికి మూడు మార్గాలున్నాయి. ఒక మార్గం నర్సంపేట నుంచి భూపతిపేట బస్టాండ్, సీతానగరం శివారు కొమ్ములవంచ మీదుగా, మరో మార్గం గూడూరు, చంద్రుగూడెం, లైన్‌తండా, వంపుతండాల మీదుగా, ఇంకో మార్గం ములుగు జిల్లా కొత్తగూడ మండల కేంద్రం, కోలారం, బత్తులపల్లి, గోపాలపురం మీదుగా భీమునిపాదం జలపాతం చేరుకోవచ్చు. దట్టమైన అటవీ ప్రాంతం ఉన్న ఈ జలపాతం రెండు దశాబ్దాలుగా పర్యాటక కేంద్రంగా పేరుగాంచింది. పర్యాటకుల రద్దీ పెరుగుతున్న క్రమంలో అక్కడ మౌలిక సదుపాయాల ఏర్పాటుపై అటవీశాఖ దృష్టి సారించింది.

వరంగల్ డీఈఓ(ఎఫ్ఏసీ)గా రంగయ్యనాయుడు



విద్యారణ్యపురి: వరంగల్ ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) డీఈఓగా పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా విధులు నిర్వర్తిస్తున్న బి.రంగయ్యనాయుడిని నియమిస్తూ కలెక్టర్ సత్యశారద శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడీగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే డీఈఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. డీఈఓ ఎం.జ్ఞానేశ్వర్‌ను రిలీవ్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్‌నికోలస్ ఈనెల 22న ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే.

బాధ్యతలు చేపట్టేందుకు విముఖత..

ఎఫ్ఏసీ డీఈఓగా బాధ్యతలు చేపట్టేందుకు రంగయ్యనాయుడు విముఖత చూపారు. ఆరోగ్య సమస్యలు ఉన్నందున విధుల్లో చేరబోనని కలెక్టర్‌కు తెలిపినట్లు సమాచారం. ఈ విషయంపై సాక్షి ఆయనను వివరణ కోరగా తాను డీఈఓగా విధుల్లో చేరబోనని స్పష్టం చేశారు. రంగయ్యనాయుడికి గతంలో వరంగల్ అర్బన్ ఎఫ్ఏసీడీఈ డీఈఓగా బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం ఉంది.

డీఈఓ కార్యాలయం ఎదుట సంబురాలు

వరంగల్ డీఈఓ విధులనుంచి జ్ఞానేశ్వర్‌ను రిలీవ్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు శనివారం హనుమకొండలోని కార్యాలయం ఎదుట సంబురాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్ మాట్లాడుతూ డీఈఓ వైఖరిపై తమ సంఘం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు. టీఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు జెరిపోతుల వంశీకృష్ణ, బాధ్యులు నాగారం మణితేజ, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుకూరి యువకిశోర్, ప్రధాన కార్యదర్శి రామంచ శ్రీను, కార్యదర్శి కోట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


బాణసంచా కాలుస్తున్న టీఎస్ఎఫ్ బాధ్యులు

ఉమ్మడి జిల్లాకు రెండు సీఓఈ కళాశాలలు

- ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఈనెల 29వ తేదీ వరకు గడువు

న్యూశాయంపేట : ఉమ్మడి వరంగల్ జిల్లాకు తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థలు(టీమ్రిస్) ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) కళాశాలలు రెండు మంజూరయ్యాయి. ఈ మేరకు టీమ్రిస్ సెక్రటరీ షఫీయుల్లా ఉత్తర్వులు జారీచేశారు. సీఓఈ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీమ్రిస్ ఉమ్మడి జిల్లా కో–ఆరినేటర్ జంగా సతీశ్ శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లా మైనారిటీ కేటగిరీకి చెందిన (ముస్లింలు, క్రిస్టియన్లు, పార్సీలు, జైనులు, సిక్కులు)వారితోపాటు నాన్ మైనారిటీ కోటా కింద (ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఓసీ) అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అర్హులన్నారు. బాలికల కోసం ఒకటి(వరంగల్(జీ1) కేయూ క్రాస్), బాలుర కోసం ఒకటి (వరంగల్ (బీ1) రంగశాయిపేట జక్కలొద్దిలో సీఓఈలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి ఈనెల 29 వరకు గడువు ఉందన్నారు. మరిన్ని వివరాలకు ములుగురోడ్డు పెద్దమ్మగడ్డ సమీపంలోని మైనారిటీ గురుకులాల ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రాంతీయ సమన్వయాధికారి కార్యాలయం లేదా 7331170866, 7331107367 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

- నాయుడు పెట్రోల్ పంపు ఎదురుగా మెయిన్ రోడ్డుకు తూర్పు ఫేస్ తో వె: 44ft x పొ: 85ft గల ప్లాట్ అమ్మకమునకు కలదు. సంప్ర॥ 9849121543. [SCA25007024]
- Wgl-Hyd మెయిన్ రోడ్‌కి రాంపూర్ కపిల్ ఫుడ్స్ బ్యాక్ సైడ్, 2nd బిట్ ఈస్ట్ నార్త్ వెస్ట్ ప్లాటు 3 పక్కల 30ft రోడ్డు కలదు. టోటల్ యార్డ్స్ 1433 అమ్మబడును. సంప్ర॥ 9849121543. [SCA25007025]
- 2 Plots for Sale, Each Measuring 500 sq.yds E/F Main road Rampur Hanamakonda Opp : Bharath Petrol pump Ph. 8977727776 [HA-01299]
- ఘట్‌కేసర్ చ॥గ॥ రూ.5700/-, భువనగిరి చ॥గ॥ రూ.3500/-, HMDA చ॥గ॥ రూ.7500/-, ఆలేరు/జనగాం చ॥గ॥ రూ.2300/- Cell: 9703650119 [HA-1327]
- 413 Sq. yards, Near Vegetable Market, S/E, Corner, Kazipet. 170 Sq. yards at Venkatadri Nagar, East Kazipet. Cont. 9398783805. [M-13916]

TO-LET

- 3-BHK, GopiKrishna Residency Flat No.506, H.No.5-9-11, Flat Rent. Kishanpura, Hanamkonda. Cell: 9959389999, 9390105601. [WA-6763]

SERVICES

హోమియో క్లినిక్

- సంతానం కావాలా ? హోమియో వైద్య చికిత్సకై సంప్ర॥ 36 సం॥ల Exp. డా॥ Ch. జితేందర్ BHMS శ్రీ రాజరాజేశ్వర హోమియో క్లినిక్. Opp: న్యూ బస్టాండ్, హన్మకొండ. 9849117394. [WA-7575]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

WANTED

- యువరాజ్ కిరాణంలో పని చేయుటకు కిరాణంలో 3 సం॥ చేసిన అనుభవం గల యువతీ యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. లోకల్ వారికి మాత్రమే. అండర్‌బ్రిడ్జి దగ్గర, వరంగల్. సెల్: 9490133696 [WA-6761]
- HNK స్వచ్ఛంద సంస్థలో నందు వాచ్‌మెన్ భార్యభర్తలు ఉన్నవారు కావలెను. ఉచిత వసతి + భోజనం మరియు జీతం ఇవ్వబడును. సంప్ర॥ 8074465703, 9849038142 [WA-56]

WANTED TEACHERS

- Wanted Teachers to teach Maths, Hindi, Science for Primary. Principal also required. Master's High School, Fort Warangal. Cell: 9347903778. [SCA25007556]
- Wanted Teachers to teach English upto 8th Class. Vandana High School, Shivanagar, Warangal. Cell: 9849943040. [SCA25007503]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198, 9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 7702221602
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

న్యాయ విద్యతో సమాజ సేవ

- వరంగల్, హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తులు


హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.పట్టాభి రామారావును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

హన్మకొండ: న్యాయ విద్యతో సమాజ సేవ చేసే గొప్ప అవకాశం లభిస్తుందని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ.నిర్మలా గీతాంబ, హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ కె.పట్టాభి రామారావు అన్నారు. శనివారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదర్శ న్యాయ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగత, చివరి సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా న్యాయమూర్తులు పాల్గొని జ్యోతి ప్రజ్వళన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తిలో నిత్య విద్యార్థిగా నేర్చుకుంటూనే ఉండాలన్నారు. అనంతరం జబర్దస్త్ ఫేమ్ వెంకీ చేసిన మిమిక్రీ ప్రదర్శన అలరించింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి. ఈసందర్భంగా ప్రధాన న్యాయమూర్తులు వీబీ.నిర్మలా గీతాంబ, డాక్టర్ కె.పట్టాభి రామారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆదర్శ న్యాయకళాశాల చైర్మన్ బూర విద్యాసాగర్, ప్రిన్సిపాల్ పి.ప్రతిభ రాథోడ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

‘స్థానికం’లో విజయం మనదే..


మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్, సమీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్
- జనహిత పాదయాత్రపై సమీక్ష

హన్మకొండ చౌరస్తా: త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం విజయం సాధించి తీరుతామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లాలో చేపట్టనున్న ‘జనహిత పాదయాత్ర’పై శనివారం హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి మంత్రులు లక్ష్మణ్, సీతక్క ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత పాదయాత్ర ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు రోజులు కొనసాగుతుందన్నారు. మొదటి రోజు వర్ధన్నపేట మండలం ఇల్లంద మార్కెట్ నుంచి వర్ధన్నపేటలోని అంబేడ్కర్ సెంటర్ వరకు, రెండో రోజు వర్ధన్నపేట నుంచి ఫిరంగిగడ్డ ప్రభుత్వ పాఠశాల వరకు కొనసాగుతుందన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ పాదయాత్ర ద్వారా ప్రజాప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ఫలాలను అందరికీ వివరించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. అభివృద్ధితో పాటు పార్టీ బలోపేతానికి మరింత చురుగ్గా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ఠాకూర్, కేఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డి, ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ బాధ్యులు సత్యనారాయణ, ఈవీ శ్రీనివాస్, ధర్మారావు, ప్రభాకర్‌రెడ్డి, బత్తిని శ్రీనివాసరావు, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డికి శ్రద్ధాంజలి ఘటించారు.

మీతో కలిసి పనిచేస్తా..

సమీక్ష సమావేశానికి హాజరుకానీ మంత్రి కొండా సురేఖ.. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి లక్ష్మణ్‌కు ఫోన్ చేశారు. అనివార్య కారణాలతో తాను సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని, ఉమ్మడి జిల్లాలో నిర్వహించే ప్రతీ కార్యక్రమానికి మీతో కలిసి పనిచేస్తామని తెలిపారు.

వ్యక్తిగత కారణాలతో హాజరుకాని ఎమ్మెల్యేలు..

వ్యక్తిగత కారణాలతో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమీక్షకు హాజరు కాలేకపోతున్నట్లు సమాచారం చేరవేశారు. కాగా, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, మురళీనాయక్, డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్ గైర్హాజరయ్యారు.

ఆటోమేటిక్ మీటరు రీడింగ్‌తో బిల్లింగ్ సులువు

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: హెచ్‌టీ సర్వీస్‌ల బిల్లింగ్‌లో లోపాలు సవరించడానికి ఆటోమేటిక్ మీటరు రీడింగ్ ప్రక్రియ ప్రారంభించామని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. ఈ విధానాన్ని డిసెంబర్ నాటికి అన్ని సర్కిళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. శనివారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎండీ మాట్లాడుతూ ప్రస్తుతం కరీంనగర్, వరంగల్, హనుమకొండలో పనులు జరుగుతున్నాయన్నారు. మోడెం ద్వారా కచ్చితమైన సమాచారం వ స్తుందన్నారు. మీటరు స్థితి, విద్యుత్ వినియోగం, సరఫరా సమాచారం రియల్ టైంలో వస్తుందని తెలిపారు. ఇలా చేయడం వల్ల పొరపాట్లకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. నవరాత్రి ఉత్సవ నిర్వాహకులు, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు, ఎన్పీడీసీఎల్ సిబ్బందికి సూచనలు తెలిపే కరపత్రం రూపొందించామని, దీనిని 16 సర్కిళ్ల పరిధిలో మండపాల నిర్వాహకులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సీఈలు అశోక్ కుమార్, సదర్ లాల్, తిరుమల్ రావు, అశోక్, వెంకట రమణ, చరణ్ దాస్, జీఎంలు అన్నపూర్ణ, సురేందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు కులమతాలకతీతంగా జీవించాలి

- రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్
- ముగిసిన కాజీపేట దర్గా ఉత్సవాలు
- పాల్గొన్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సారయ్య


మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్


పొట్టలో ఇనుప చువ్వలు దించుకుంటున్న ఫకీర్

కాజీపేట రూరల్ : ప్రజలు కులమతాలకతీతంగా కలిసి ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కాజీపేట దర్గా ఉత్సవాలు ముగింపునకు మంత్రి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకాగా నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి ఫకీర్ల విన్యాసాలు తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చారిత్రక కాజీపేట దర్గా దీవెనలతో తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రసిద్ధిగాంచిన కాజీపేట దర్గా ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుగుతాయన్నారు. అనంతరం దర్గా పీఠాధిపతి, తెలంగాణ రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా మాట్లాడుతూ దేశ నలుమూలల నుంచి పీఠాధిపతులు, కులమతాలకతీతంగా భక్తులు తరలొచ్చి దర్గాను దర్శించుకుని అల్లా దీవెనలు పొందారన్నారు.

ఆకట్టుకున్న ఫకీర్ల విన్యాసాలు..

కాజీపేట దర్గా ముగింపు ఉత్సవంలో ఫకీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్, పూణె నుంచి వచ్చిన ఫకీర్లు విన్యాసాలు చేపట్టారు. కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన దర్గా పీఠాధిపతి అబ్దుల్ రజాక్ బాబామలంగ్ మసుమన్ మదారి, మన్సూర్ బియాబానీ, ముస్లిం మతపెద్దలు, వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇవి.శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకుడు ఆనంద్ మోసస్, ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ కార్పొరేటర్ అబుబాకర్, సింగారపు రవిప్రసాద్, కందుకూరి పూర్ణచందర్, ఆరూరి సాంబయ్య, ఎం.డి. ఇంతియాజ్, లెంకలపల్లి శ్రీనివాస్, పోతరబోయిన శ్రీనివాస్, ఎస్.కె.సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు సమాయత్తం కావాలి


మాట్లాడుతున్న కరీంనగర్ జోన్ ఈడీ సోలమన్

- ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సోలమన్

హన్మకొండ: మేడారం జాతరకు ఆర్టీసీ అధికారులు సమాయత్తం కావాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ పి.సోలమన్ సూచించారు. శనివారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో కరీంనగర్ జోన్‌లోని రీజినల్ మేనేజర్ల సమావేశం నిర్వహించారు. ఇందులో 2026 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరగనున్న మేడారం జాతర్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ 2024 మేడారం జాతరలో ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగిందన్నారు. దీనికి కారణం సొంత వాహనాలు విరివిగా రావడమేనని, ప్రైవేట్ వాహనాల నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ట్రాఫిక్ జామ్ అయ్యి మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని గుర్తు చేశారు. మేడారం భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని, దీనిపై అధికారులు విస్తృత ప్రచారం చేయాలన్నారు. భక్తుల సంఖ్యకనుగుణంగా బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం ఆర్ఎంలు డి.విజయభాను, బి.రాజు, భవానీ ప్రసాద్, ఎ.సరిరాం, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భాను కిరణ్, శ్రీ మహేశ్, భూపతిరెడ్డి, మధుసూదన్, ఈఈ బీఆర్ సింగ్, అకౌంట్స్ ఆఫీసర్ ఎ. రవీందర్, డిపో మేనేజర్లు ధరమ్ సింగ్, రవిచంద్ర, అర్పిత, శివకుమార్, శ్రీరాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్, పక్కన కలెక్టర్లు స్నేహశబరీష్, సత్యశారద, రిజ్వాన్ బాషా

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- మూడుజిల్లాల కలెక్టర్లు, జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌తో సమన్వయ సమావేశం


హాజరైన వివిధ శాఖల అధికారులు

కేయూ క్యాంపస్: గణేశ్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. శనివారం కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం సెనేట్‌హాల్‌లో కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, గణేశ్ ఉత్సవ కమిటీ, హిందూ ధర్మ పరిషత్, ముస్లిం మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో సీపీ మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలు పోటీ తత్వంతో కాకుండా భక్తిభావంతో నిర్వహించాలని తెలిపారు. మండపాలకు విద్యుత్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. గణేశ్ నిమజ్జనం, మిలాద్ – ఉన్ –నబీ ఒకేరోజు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో మతసామరస్యం దెబ్బతినకుండా ఒకరికొకరు సహకరించుకోవాలని కోరారు. హనుమకొండ కలెక్టర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ జిల్లాపరిధిలో 12 నిమజ్జనం ప్రదేశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వరంగల్ కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలో 35 వరకు చెరువులు ఉన్నాయని, అక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగుండా నిమజ్జనానికి చర్యలు చేపడుతామన్నారు. వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్ పాయ్ మాట్లాడుతూ నిమజ్జనం ప్రదేశాల్లో వివిధ పనులను చేపట్టేందుకు రూ. 18లక్షలు కేటాయించామన్నారు. మున్సిపల్ పరిధిలోని చిన్న వడ్డేపల్లి, పద్మాక్షి టెంపుల్, వరంగల్ జిల్లా పరిధిలో 15, హనుమకొండ జిల్లా పరిధిలో 12 నిమజ్జన ప్రదేశాల్లో వివిధ పనులు చేపట్టనున్నామన్నారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల అదనపు కలెక్టర్లు, డీసీపీలు, ఏసీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.